స్పౌజ్ పింఛన్లు అందని ద్రాక్షేనా?


పింఛన్ కోసం వేచి ఉన్న గిరిజన వృద్ధురాలు వెంకటమ్మ

- రెండు నెలలుగా కాలయాపన
- కూటమి ప్రభుత్వ తీరుపై లబ్ధిదారులు మండిపాటు

వరదయ్యపాళెం మండలం యానాదివెట్టు పంచాయతీ కోవూరుపాడు గిరిజనకాలనీకి చెందిన జి. గుండయ్య ఏడాది క్రితం మృతి చెందాడు. రెక్కాడితేగానీ డొక్కాడని గిరిజన కుటుంబం వారిది. భర్తను కోల్పోయి వృద్ధాప్యంలో ఉన్న వెంకటమ్మ వితంతు పింఛన్ కోసం ఏడాదిగా ఎదురుచూపులు చూస్తోంది. సచివాలయం వద్దకు తిరగని రోజు లేదు. అయితే కూటమి ప్రభుత్వం మూడు నెలల క్రితం కుటుంబంలో పింఛన్ వస్తూ మృతిచెందిన కుటుంబానికి తక్షణమే పింఛన్ మంజూరు చేస్తామని ప్రగల్భాలు పలికారు. అయితే వెంకటమ్మ తన భర్తకు వస్తున్న వృద్ధాప్య పింఛన్‌ను ఆయన మృతిచెందడంతో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంది. సచివాలయంలో మాత్రం పింఛన్ మంజూరైనట్లు చెబుతున్నారు. 2నెలలుగా చేతికి మాత్రం పింఛన్ నగదు అందలేదని, భర్తను కోల్పోయిన వృద్ధురాలు వెంకటమ్మ వాపోతోంది. కూటమి సర్కారు కరుణించకపోవడంతో నగదు పింఛన్ కోసం ఎదురుచూస్తోంది.

వరదయ్యపాళెం మండలం రాచర్ల పంచాయతీకి చెందిన అరుంధతి వాడలో 6 నెలల క్రితం జగ్గయ్య మృతిచెందాడు. అయితే ఆయన భార్య మస్తానమ్మ పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంది. అయితే నూతన పింఛన్లను కూటమి ప్రభుత్వం ఏడాదిగా మంజూరు చేయలేదు. తాజాగా ప్రవేశపెట్టిన స్పౌజ్ పింఛన్‌కు ఆమె అర్హత పొందింది. రెండు నెలలుగా పింఛన్ వస్తుందని ఎంతో ఆశగా ఎదురు చూడడమే తప్ప చేతికి నగదు అందలేదని ఆ మహిళ ఆవేదన చెందుతోంది. ఇల్లు గడవక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆమె వాపోతోంది.

వరదయ్యపాళెం: కూటమి సర్కారు అధికారం చేపట్టి ఏడాది పూర్తయి రెండో ఏడాదిలోకి అడుగు పెట్టింది. ఈ ఏడాది కాలంలో అర్హులైన వారికి కొత్తగా ఒక్క పింఛన్ కూడా మంజూరు చేయలేదు. వృద్ధాప్య పింఛన్ వచ్చి భర్త చనిపోతే భార్యకు ఇచ్చే స్పౌజ్ (భాగస్వామి) పింఛన్లు మాత్రమే ఇస్తామని చెబుతున్నా.. వారికి కూడా మొండి చెయ్యి చూపుతోంది. ఆ పింఛన్లను కూడా కొత్తగా మంజూరు చేసినట్లు గొప్పలు చెప్పుకుంటోంది. పోనీ అవి కూడా సకాలంలో ఇస్తున్నారా అంటే అదీ లేదు. ప్రచారంపై ఉన్న శ్రద్ధ అమలులో చూపించడంలో లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మంజూరైనా.. సొమ్ము అందదు

నియోజకవర్గంలో స్పౌజ్ కోటా కింద 499 పింఛన్లు మంజూరయ్యాయి. వీరందరికీ గత నెల 12వ తేదీన అందజేస్తామని కూటమి సర్కార్ ప్రకటించింది. అయితే ప్రకటించిన తేదీ పోయి నెల మారింది. ఈ నెలలో కూడా వారికి డబ్బులు విడుదల చేయలేదు. ఇస్తారో లేదోనని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

రెండు నెలలుగా ఎదురుచూపులు:

అదిగో మంజూరు.. ఇదిగో పంపిణీ అంటూ గత మూడు నెలలుగా స్పౌజ్ పింఛన్ల మంజూరుపై కూటమి ప్రభుత్వం హడావుడి చేస్తోంది. అయితే అర్హత కలిగిన లబ్ధిదారులకు మాత్రం నేటి వరకు పింఛన్ సొమ్ము అందలేదు. దీంతో గత జూన్, జులై నెలలో పింఛన్ సొమ్ము అందుతుందని ఎంతో ఆత్రుతగా లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వ తీరు లబ్ధిదారులకు అందని ద్రాక్షగా మారింది.

అర్హులందరికీ మంజూరు చేయాలి



స్పౌజ్ కాకుండా భర్త చనిపోయిన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందజేయాలి. గతంలో భర్త చనిపోయిన ఆరు నెలల్లోపు వితంతు పింఛన్ మంజూరయ్యేది. సంబంధిత అధికారులు భర్త చనిపోయిన వెంటనే పింఛన్ మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలి. కేవలం స్పౌజ్ కోటా వారికి మాత్రమే ఇస్తామనడం సరికాదు. ప్రభుత్వంలో చిత్తశుద్ధి లోపించింది..

–సాయిరెడ్డి, సర్పంచ్, వరదయ్యపాళెం మండలం

అర్హులందరికీ అందజేస్తాం



స్పౌజ్ కోటా కింద అర్హత ఉన్న వారందరికీ పింఛన్లు మంజూరయ్యాయి. వెల్ఫేర్ అసిస్టెంట్ యాప్‌లో ఎనేబుల్ అవ్వలేదు. దీని వల్ల డబ్బులు పంపిణీ చేయలేదు. యాప్ ఎనేబుల్ అయిన వెంటనే మంజూరైన లబ్ధిదారుందరికీ పింఛన్ సొమ్ము అందజేస్తాం.

–ప్రసాద్, ఎంపీడీఓ, వరదయ్యపాళెం మండలం

సత్యవేడు టీడీపీలో అంతర్గత పోరు

కేవీబీపురం: నియోజకవర్గంలో టీడీపీ నేతల మధ్య అంతర్గత పోరు రోజురోజుకు ముదిరి తారాస్థాయికి చేరుకుంది. ఒకే కార్యక్రమాన్ని వర్గాలుగా విడిపోయి తలోదారిలో చేస్తున్నారు. నవ్వి పోదురుగాక నాకేమి సిగ్గు అన్నచందాన ఎవరిదారిలో వారు వారి పనిచేసుంటూ పోతున్నారు. వివరాల్లోకి వెళితే మండలంలోని కేజీబీవీ, ఏపీ మోడల్ పాఠశాలలో గురువారం జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి టీడీపీ ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయనకు పాఠశాల సిబ్బంది అధికారిక స్కౌట్ గౌరవ వందనం చేస్తూ ఆహ్వానం పలకడం, కేవీబీపురం ఎస్‌ఐ కూరపాటికి అధికారిక సెల్యూట్ చేయడం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. కార్యక్రమానికి టీడీపీ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు మునస్వామియాదవ్ అధ్యక్షత వహించారు. టీడీపీ నేతలు కొందరు, ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా కావాలనే ప్రభుత్వ కార్యక్రమాల్లో పార్టీ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్‌ని తీసుకొచ్చి పెత్తనం చేలాయించడం తగదని వాదనకు దిగారు. ఎమ్మెల్యేతోపాటు, అందరూ పార్టీ మండల నేతలు కలిసి వస్తేనే ఎలాంటి కార్యక్రమమైనా జరుగుతుందని, లేకుంటే పార్టీకి దూరంగా ఉంటామని అక్కడి నుంచి వెళ్లిపోయారు.

డిగ్రీ అడ్మిషన్స్‌పై జాప్యమేల?

శ్రీకాళహస్తి: ఇంటర్ ఫలితాలు ప్రకటించి రెండు నెలల గడుస్తున్నా ఇప్పటి వరకు డిగ్రీ అడ్మిషన్స్ నోటిఫికేషన్‌పై జాప్యమేల అంటూ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్ రవి విమర్శించారు. గురువారం శ్రీకాళహస్తి డిగ్రీ కళాశాల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యలో విప్లవం అంటూ ప్రకటనలు తప్ప ఇప్పటి వరకు చేసింది ఏమీలేదన్నారు. ఎస్ఎఫ్ఐ శ్రీకాళహస్తి మండల కార్యదర్శి డేవిడ్ చరణ్ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు పగలగొట్టండి : సీపీఐ

శ్రీకాళహస్తి: సీపీఐ శతాబ్ది ఉత్సవాలు సందర్భంగా మహాసభల నిర్వహణ విజయవంతానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి పిలుపునిచ్చారు. గురువారం ఉదయం 11 గంటలకు శ్రీకాళహస్తి మార్కెట్ యార్డ్‌లో సివిల్ సప్లయిస్ శాఖ మహాసభ అయ్యప్ప అధ్యక్షతన జరిగింది మహాసభకు హాజరైన సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. స్మార్ట్ మీటర్లు పెడితే సీపీఐ ఆధ్వర్యంలో గ్రామ గ్రామాల్లో పగలగొడతామని పిలుపునిచ్చారు సీపీఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మార్కెట్ యార్డ్‌లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జనామాల గురవయ్య నగర కార్యదర్శి గోపి అయ్యప్ప పాల్గొన్నారు.

రైల్వే అభివృద్ధి కమిటీ సమావేశం

రేణిగుంట: రైల్వేస్టేషన్ అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై రైల్వే అధికారులు అభివృద్ధి కమిటీ సభ్యుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. రేణిగుంట రైల్వేస్టేషన్‌లోని కార్యాలయంలో గురువారం రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులతో రైల్వే అధికారులు సమావేశం నిర్వహించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా స్థానిక సర్పంచ్ నగేషం పాల్గొన్నారు. స్టేషన్లో చేయాల్సిన అభివృద్ధి పనులపై ఈ సందర్భంగా చర్చించారు. సభ్యుల అభిప్రాయాలను తెలుసుకుని ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామని రైల్వే అధికారులు తెలిపారు. స్టేషన్ మాస్టర్ శేషగిరినాథరెడ్డి, ఎస్ఎస్‌లు ఎన్ఎస్ రెడ్డి, మునిశేఖర్, సీసీఐ మల్లికార్జున్, సీహెచ్ఎఫ్ శ్రీహరి రావు, సభ్యులు బాలాజీ, మధుకర్ పాల్గొన్నారు.

మహిళా హాస్టల్ తనిఖీ


మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్

శ్రీకాళహస్తి: స్థానిక తెలుగుగంగ కాలనీలోని మహిళల వెనుకబడిన తరగతుల హాస్టల్‌ను శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్ నాయక్ తనిఖీ చేశారు. హాస్టల్లోని స్టోర్ రూమ్, పరిసర ప్రాంతాలు, వంటశాలలను పరిశీలించారు. న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ మన పరిసర ప్రాంతాలు శుభ్రంగా పెట్టుకోవాలని విద్యార్థులకు సూచించారు. న్యాయవాదులు, పారా లీగల్ వలంటర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోలాహలం.. గంగమ్మ జాతర


కుండలతో వెళుతున్న మహిళలు

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురంలో గురువారం గంగమ్మ జాతర కోలాహలంగా జరిగింది. మహిళలు పెద్ద సంఖ్యలో కుండల్లో నైవేద్యం తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. జాతర సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు వేషాలు కట్టి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

తేలు కాటుకు బాలిక మృతి


గేక్షిత (ఫైల్)

బుచ్చినాయుడుకండ్రిగ: తేలు కాటుకు ఓ చిన్నారి బలైంది. మండలంలోని కాంపాళెం గ్రామ దళితవాడకు చెందిన అక్కరపాకం వేంకటేష్ కుమార్తె గేక్షిత (7). స్థానిక శ్రీనివాసతేజ పాఠశాలలో 2వ తరగతి చదువుతోంది. మంగళవారం ఇంటి వద్ద చిన్నారికి తేలు కుట్టడంతో వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. పాఠశాల యాజమాన్యం గురువారం సెలవు ప్రకటించింది. కరస్పాండెంట్ సుధాకర్, టీచర్లు సంతాపం వ్యక్తం చేశారు.

కంటి వైద్యశిబిరానికి స్పందన


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రేణిగుంట: రాష్ట్రీయ సేవా సమితి వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి స్వర్గీయ పద్మశ్రీ డాక్టర్ గుత్తా మునిరత్నం ఆశయాలకు అనుగుణంగా గురువారం శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని కరకంబాడిలోని రాస్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. స్థానికులు పాల్గొని కంటి పరీక్షలు చేసుకున్నారు. మేనేజర్ వాసుదేవరెడ్డి, డాక్టర్లు కె.సింధు బృందం, నర్సులు, ఆర్గనైజర్ జీవన్ రావు, ట్రస్టీలు సుబ్బరత్నమ్మ, నిత్యసుధ, రాస్ సిబ్బంది గిరి, అన్బలగన్, వినోద్, ముఖేష్ పాల్గొన్నారు.

ప్రసవాల శాతం పెంచాలి

సత్యవేడు: కమ్యూనిటీ వైద్యశాలలో గర్భిణుల ప్రసవాలు శాతం పెంచాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. గురువారం కమ్యూనిటీ వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు హేమ భూషణం, గణేష్‌కుమార్, డాక్టర్లు విద్యాసాగర్, రిహాన్‌నాజ, చంద్రన్, బాలకృష్ణ పాల్గొన్నారు.

బాలనాగాలమ్మ ఉత్సవాలు


పాలబిందెలతో భక్తులు

సత్యవేడు: బాలనాగాలమ్మ అమ్మవారి వార్షికోత్సవాలు భక్త బృందం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. గురువారం బాలనాగాలమ్మ, గ్రామ దేవత చదవాలమ్మ (గంగమ్మ)కు విశేషాలంకరణ చేసి గ్రామోత్సవం నిర్వహించారు. శ్రీ మాతంగీశ్వరాలయం నుంచి పాల బిందెలతో అమ్మవారిని ఊరేగించారు. పెళ్లి కాని వారు, సంతానలేమితో బాధపడుతున్న వారు, నిరుద్యోగ యువతీ యువకులు కంకణాలు ధరించి, పాలబిందెలు తలపై పెట్టుకుని ఊరేగింపుగా వెళ్లారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



విరాళం ఇస్తున్న కస్తూరి కిరణ్, విరాళం ఇస్తున్న తరిమిని అనిల్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన కస్తూరికిరణ్ రూ.80వేలు, విజయనగరానికి చెందిన తరిమిని అనిల్ రూ.25,116లను ఆలయ అధికారులకు విరాళంగా అందజేశారు. దాతలకు అధికారులు స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు.

దుకాణాల తనిఖీ


దుకాణంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

శ్రీకాళహస్తి: పాఠశాలల సమీపంలో పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు తప్పవని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. పట్టణంలోని ముత్యాలమ్మ గుడి వీధిలోని ఆక్స్‌ఫర్డ్ డిగ్రీ కళాశాల సమీపంలోని దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. పొగాకు విక్రయిస్తుండడంతో 5 దుకాణాలకు చలానాలు విధించారు. సీఐ గోపి పాల్గొన్నారు.

వెండి హారతి సెట్ బహూకరణ


ఈఓకు హారతి సెట్‌ను ఇస్తున్న ఝాన్సీలక్ష్మీబాయి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మేధో గురుదక్షిణామూర్తికి గురువారం శ్రీచైతన్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ బొప్పన ఝాన్సీలక్ష్మీబాయి, డైరెక్టర్ సీమ రూ.4.10లక్షలు విలువ చేసే వెండి హారతి సెట్‌ను సమర్పించారు. వీటిని ఈఓ బాపిరెడ్డి స్వీకరించి దాతలకు దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు


రేణిగుంటలో బాబాను దర్శించుకుంటున్న భక్తులు


నాగలాపురంలో భక్తుల సందడి


శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి

నారాయణవనం: మండలంలో గురుపౌర్ణమిని ఘనంగా జరుపుకున్నారు. స్థానిక సారకాయల స్వామి అలయంలో పౌర్ణమి సందర్భంగా బుధవారం రాత్రి హోమగుండానికి ప్రత్యేక పూజలను, ఊంజల్‌సేవను, రథోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం సుందరంగా సారకాయలస్వామిని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మండలంలోని సింగిరికోనలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పున్నమి సందర్భంగా శ్రీదేవి, భుదేవి సమేత లక్ష్మీనరసింహ స్వామికి ఆలయ ప్రాకారోత్సవం, ఊంజల్‌సేవను నిర్వహించారు. నరసింహస్వామి ఆలయాన్ని దర్శించుకున్న భక్తులకు ట్రస్టీ నిర్వాహకులు అన్నప్రసాదాలను అందజేశారు.

నాగలాపురంలో..

నాగలాపురం: స్థానిక వీకేఎం వీధిలోని షిరిడీ సాయిబాబ ఆలయంలో గురువారం గురుపౌర్ణమిని అత్యంత వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం సాయిబాబాను సుందరంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూరహారతులు పట్టి సాయిబాబాను దర్శించుకున్నారు.

సత్యవేడులో..

సత్యవేడు: పట్టణంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున కాగడా హారతితో వేడుకలు ప్రారంభించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి బాబా పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు.

రేణిగుంటలో..

రేణిగుంట: స్థానిక షిరిడీ సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి పురవీధుల్లో షిరిడీ పద్ధతిలో పల్లకీ సేవను నిర్వహించారు. రాత్రి స్వామివారికి పవళింపు సేవ నిర్వహించడంతో వేడుకలు ముగిశాయి.

వేదోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం గురుపౌర్ణమిని పురస్కరించుకుని వేదోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

కనుల పండువగా ఊయల సేవ



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఊయల సేవ కనుల పండువలా జరిగింది. మొదట ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. అనంతరం ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఊరేగింపుగా ఊయలసేవ మండపానికి తీసుకొచ్చారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య ఊయల సేవ జరిగింది. వెన్నెల కాంతుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి


రేణిగుంట బాలుర హైస్కూల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు


నాగలాపురంలో విద్యార్థులకు మొక్కలు, గ్రీన్ పాస్‌పోర్ట్ ఇస్తున్న టీచర్లు

సత్యవేడు: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకునేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సూచించారు. గురువారం స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌కు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తల్లిదండ్రులకు మ్యూజికల్ చైర్‌పోటీలు నిర్వహించారు. పాఠశాల పరిధిలో ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థులను తల్లి దండ్రులతో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ రవి పాల్గొన్నారు.

రేణిగుంటలో..

రేణిగుంట: స్థానిక బాలికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు శ్యామల ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ కార్యక్రమానికి డాక్టర్ జనార్దన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బాయ్స్ హైస్కూల్‌లో హెచ్ఎం శంకరీ, విద్యా కమిటీ చైర్‌పర్సన్ టి.లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. కరకంబాడి, తారకరామా నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్, టీచర్ మీటింగ్‌ను నిర్వహించారు. ఎంఈఓలు ఇందిరాదేవి, రంగనాథయ్య పర్యవేక్షించారు.

రేణిగుంట: విప్పమానపట్టెడ పంచాయతీ, వేమాపురం సంజీవరెడ్డి కాలనీలోని మండల ప్రజాపరిషత్ పాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ వి.లక్ష్మీపతి రెడ్డి, విద్యా కమిటీ చైర్‌పర్సన్ వి విమల, టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అదేవిధంగా కరకంబాడి అమరరాజా విద్యాలయంలో కూడా నిర్వహించారు. విద్యార్థులు తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించారు. పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: మండలంలోని అన్ని స్కూళ్లలో గురువారం మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం జరిగింది. పాపానాయుడుపేట జూనియర్ కళాశాలలో జరిగిన సమావేశానికి సర్పంచ్ మేకళత్తూరు లలిత, ప్రిన్సిపల్ జీవీ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. పల్లం హైస్కూల్‌లో హెచ్ఎం తీగల ఆనంద్, పంగూరు హైస్కూల్‌లో హెచ్ఎం రామచంద్రయ్య, ఏర్పేడులో హెచ్ఎం మునిలక్ష్మి ఆధ్వర్యంలో జరిగాయి. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


పాండూరు హైస్కూల్‌లో సమావేశం


విక్రమ్ పాఠశాలలో..

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: కంచనపుత్తూరు, కల్లివెట్టు, నీర్పాకోట గ్రామాల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ కమిటీ మీటింగ్ జరిగింది. తల్లిదండ్రులు, టీచర్లు సమావేశానికి హాజరై విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఎంఈఓ–2 మునిసుబ్రమణ్యం పాల్గొన్నారు.

నాగలాపురంలో..

నాగలాపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్లస్‌లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కస్తూరయ్య ఆధ్వర్యంలో పేరెంట్స్,టీచర్స్ సమావేశం నిర్వహించారు. సర్పంచ్ చిన్నదొరై, ఎంఈఓ బాబయ్య, డాక్టర్. రామచంద్రన్, హాజరయ్యారు. అనంతరం ప్రతి విద్యార్థికి ఒక మొక్కతో పాటు గ్రీన్ పాస్‌పోర్ట్ ఇచ్చారు. పిల్లలకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: పాండూరు పాఠశాలలో పేరెంట్స్ టీచర్స్ సమావేశం జరిగింది. కార్యక్రమానికి పెద్ద పాండూరుకు చెందిన దాత శీనురెడ్డి హాజరయ్యారు. పాఠశాల అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. హెచ్ఎం మునిసుబ్రమణ్యం, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రఫీ పాల్గొన్నారు.

నారాయణవనంలో..

నారాయణవనం: మన ఊరి బడిని అందరం కలిసి సమష్టిగా అభివృద్ధి పరచుకోవాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. గురువారం స్థానిక బాలికల ప్లస్ పాఠశాలలో జరిగిన పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యలో ప్రతిభను కనబరిచిన పిల్లల తల్లులను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం మనోహరి, జెడ్పీటీసీ సుమన్‌కుమార్, ఎంఈవోల కస్తూరయ్య, జనార్దనరాజు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: పట్టణంలోని కాసా గార్డెన్‌లో ప్రభుత్వ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో గురువారం మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి, పురపాలక సంఘ కమిషనర్ సంజీవకుమార్, రెండవ పట్టణ సీఐ నాగార్జునరెడ్డి, ప్రిన్సిపల్ జయశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విక్రమ్ సక్సెస్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో..

శ్రీకాళహస్తి: పట్టణంలోని విక్రమ్ సక్సెస్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో మెగా పేరెంట్స్, టీచర్స్ 2.0ను నిర్వహించారు. ఈసందర్భంగా తల్లికి వందనం గురించి వివరించారు. పిల్లలు తల్లుల పాదాలకు నమస్కరించారు. ప్రిన్సిపల్ మునిలక్ష్మి, తొట్టంబేడు సీనియర్ అసిస్టెంట్ నారాయణస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా విక్రమ్ నెక్స్ జనరేషన్ పాఠశాల, విక్రమ్ జూనియర్ కళాశాలలో కూడా ఈ వేడుకలను నిర్వహించారు. కరస్పాండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.